# నిర్ణయం

"అమ్మాయి మాకు నచ్చింది. నువ్వో మారు ఆనకాపల్లి వెళ్ళి పిల్లను చూసిరా 'ఊ' అంటే ముహూర్తం పెట్టేసుకుందాం" అన్నారు అమ్మానాన్న శశిధర్ మాటలకు నవ్వుకుంటూ, మరింకేం వెళ్ళిరా. నీ ఓకే కోసం మేమంతా ఎదురుచూస్తూ వుంటాం" అన్నాను యధాలాపంగా.

"నువ్వు కూడ నాతో వస్తున్నావు" "నేనా!. . . ."

"ఔను. అమ్మాయి నీకు. నచ్చితే నాకు నచ్చినట్లే. రేపే మన ప్రయాణం సిద్ధంగా వుండు" బలవంతం చేసాడు శశధర్.

"నాకు సెలవులులేవు. ఇబ్బంది పెట్టకు" సున్నితంగా నా అసమ్మతిని తెలియ చేసాను. అయినా వాడు నన్నో పట్టాన విడిచిపెట్టలేదు. "రేపు కార్తీకసోమవారం నీకెలాను ఆప్షన్ హాలీడేయే కదా. నువ్వు రాకుంటే నేను వెళ్ళను" అంటూ పట్టుబట్టడంతో సరేననక తప్పలేదు.

ఆంతలో మా శ్రీమతి పట్టుకొచ్చిన బ్రూ ఇనిస్టెంట్ కాఫీ తృప్తిగా సేవించి ఏ టైముకి ఏ బస్సులో వెళ్ళాలో వివరంగా చెప్పి హడావిడిగా వెళ్లి పోయాడు శశిధర్.

ఉద్యోగ నిమిత్తం నేను విజయ నగరం వచ్చి ఐదేళ్ళవుతోంది. స్థానిక పురపాలకోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తి కావడం మూలాన నాకు ట్రాన్స్‌ఫర్ ప్రసక్తి రాలేదు. శశిధర్ స్టేట్ బ్యాంక్ ఫోర్ట్ బ్రాంచిలో క్యాషియరు. పాతికేళ్ళ యువకుడు. మాంచి స్ఫురద్రూపి. నేనంటే వల్లమాలిన గౌరవాభిమానాలున్నాయన్న సంగతి వేరే చెప్పనక్కర్లేదు నేను ప్రతినెలా ఆర్.డి కట్టేందుకు బ్యాంకుకు వెళుతూ వాడితో

పరిచయమైంది. క్రమేపి ఆ పరిచయమే స్నేహంగా రూపొందింది. తీరిక దొరికి నప్పుడల్లా మా ఇంటికి వచ్చేసి నాకు నుత్తేనస్తా వుంటాడు. సెలవుదినాల్లో సాయంత్రల పూట ఏ పార్కుకో. సినిమాకో వెళుతూ వుంటాం శశిధర్ నా దగ్గర ఏ విషయాన్ని దాచడు డిగ్రీ హోదా ఎన్నున్నా డాంబికం లేదతడిలో అందుకే వాడంటే నాకెంతో ఇషం.



శశిధర్ నిర్ణయించిన టైముకి కాంప్లెక్సులో బస్సెక్కాం. నాకు ఆనకా పల్లికొత్తేమీ కాదు. బి యస్.సి అక్కడే ఎ.ఎమ్.ఎ. యల్ కాలేజిలో చదివాను. చదువు పూర్తవగానే విజయనగరంలో ఉద్యోగం సంపాదించాను శశిధర్ పెళ్లి చూపుల మాటెలావున్నా ఆ వూరు వెళుతున్నందుకు నాకెంతో సంతోషంగా వుంది.

మేము ఆనకాపల్లిలో ఆడుగుపెట్టే సరికి ఉదయం పదైంది. హోటల్లో కాస్తరిఫ్రషయి గాంధీనగరానికి రిక్షామాట్లాడు కున్నాం మళ్ళీ ఎంతోకాలం తరువాత అనకాపల్లి పురవీధుల్ని తిలకించే అవకాశం లభించింది. గతస్మృతులు ఒక్కొక్కటి కళ్ళముందు కదలాడుతూ నన్ను వుక్కిరిబిక్కిరి చేయసాగాయి.

రిక్షా ఒక పెంకుటింటిముందాగింది. శశిధర్ ముందుగా ఉత్తరం రాసాడో ఏమో వాళ్లంతా గుమ్మంలో నిలబడి మాకోసం ఎదురు చూస్తున్నారు మా మర్యాదలకేమీ లోటురాలేదు.

కాఫీ ఫలహారాలు పూర్తయ్యాయి. నాకు ఉబుసుపోక టీపాయి మీద పడివున్న వారపత్రికతీసి పేజీలు త్రిప్పసాగాను.

అమ్మాయిని సింగారి చిమాముందు కూర్చోబెట్టారు.

నన్ను చూడమన్నట్లు మోచేతితో నన్ను గుద్దాడు శశిధర్.

అప్రయత్నంగా పుస్తకంలోంచి పెళ్లికూతురివేపు దృష్టిసారించాను.

ఆ అమ్మాయిని ఎక్కడోబాగా చూసినట్లు గుర్తు.

నన్ను చూడటంతోనే కాస్తకంగారుపడ్డట్లు ఆమె ముఖక వళికలు చెబుతున్నాయి. నా మెదడు చురుగ్గా పని చేయడం ప్రారంభించింది. నా జ్ఞాపకాల పొరల్లో మరచిపోలేని సంఘటన అది.

ఆరేళ్ళ క్రితం. . . .

ఆ సంఘటన గుర్తొచ్చే సరికి వులిక్కి పడ్డాను.

★ ★ ★

ఆనకాపల్లిలో డిగ్రీ చదివే రోజుల్లో సెలవులకు మా స్వస్థలం నర్సీపట్నం వెళ్ళేవాడిని. మా వెనుక వీధిలో గోవిందయ్యా మాష్టారుండేవారు. ఆయనకు సౌందర్య. సౌజన్య అని మాణిక్యాల్లాంటి ఇద్దరు కూతుళ్ళు. సంక్రాంతి పండుగ సెలవులకనుకుంటాను. నర్సీపట్నంలో ఏ తోచక స్నేహితులతో కలసి వీర్రాజులో అడుతున్న "అనుబందాలు" సినిమా మొదటి అటకు వెళ్ళాం రాత్రి పదైంది. అప్పుడే ఇంటికిపోయి చేసే పాటేమీ లేకపోవటంతో సామిల్లు వరకు వెళ్ళి మదుంమీద కూర్చుని కాలేజీ విషయాలు ముచ్చటించుకుంటున్నాం.

ఉన్నట్లుండి ఆ దగ్గర్లో ఎవరిదో మూలుగుమా చెవుల్లో పడింది పరుగున అటుగా వెళ్ళి టార్చిలైటు వేసి చూసాం. అక్కాడ కంటబడ్డ దృశ్యానికి భయంతో వణికిపోయాను. మిసమిసలాడే పరువంలోవున్న పదహారేళ్ళ అమ్మాయి స్పృహలేకురడా పడివుంది. చిరిగిన జాకెట్టు. స్థానభ్రంశం చెందిన వోణి, అ స్తవ్యస్తంగా వున్న పరికిణీ, ముఖంమీద ఎర్రటిగాట్లు సామూహిక మానభంగానికి గురైనట్లు కనిపిస్తోందామె ఆమె ఎవరోకాదు, గోవిందయ్యగారి అమ్మాయి సౌజన్య.

ఆమె నిస్సహాయ స్థితికి ద్రవించుకుపోయింది నా హృదయం. మరుక్షణం రిక్షా పిలిచి మాష్టారింటికి చేర్చాం. అప్పటికే గోవిందయ్యగారు ట్యూషన్‌కు వెళ్ళి తిరిగి రాని కూతురు కోసం అన్ని చోట్లా గాలించివచ్చారు. అమె మాన భంగానికి గురైన విషయం క్షణాల్లో వూరంతా ప్రాకిపోయింది. నాటినుండి ఆమెను జూలోని జంతువును చూసినట్లు చూసేవారు. బంధువులు, స్నేహితులు ప్రశ్నలతో కాకుల్లా పొడుచుకుతిన్నారు. తోటి విద్యార్ధినులకు ముఖం చూపలేక చదువుకు స్వస్తిచెప్పింది. పదిమందిలో గోవిందయ్యకు తల తీసేసినట్లైంది. గాయపడిన హృదయంతో మాష్టారు ఆ వూరు విడిచిపెట్టి వెళ్ళి పోయారు.

ఆ తర్వాత సౌజన్య తండ్రి ఏమయ్యాడో ఏమో ప్రస్తుతం ఆమె తన మేనమామసంరక్షణలో ఇక్కడవుంటోందని అర్థమయింది. "నీ ఉద్యేం చెప్పు" అన్నట్లునా వైపు చూసాడు శశిధర్

నాలో అలజడి ప్రారంభమయింది. అమ్మాయిని ఇష్టపడినట్లు శశిధర్ చూపులు చెబుతున్నాయి. నేను గ్రీన్‌సిగ్నల్ ఇస్తే వారి పెళ్లికి మరే సమస్యా లేదు. ఐతే చూస్తూ చూస్తూ నాపై కొండంత విశ్వాసం వుంచిన మిత్రుడికెలాద్రోహం చేయను?. . . ఏదిఏమైనా జరిగిన సంఘటన వాడికి తెలియజెప్పాలి. అ తర్వాత వాడి అభీష్టానికి విడిచిపెట్టాలి. ఆదే న్యాయం. ఆదే ధర్మం. ఆదే స్నేహం కాదు. . . ఆది ఆన్యాయం. ఆధర్మం అని నా మనసు ఘోషిస్తోంది. సౌజన్య అమాయకురాలు. గుణవతి. ఎవరో దుర్మార్గులు, నరరూపరాక్షసులు కామోద్రేకంతో ఆమె శీలాన్ని ఆపహరించారు. అంతమాత్రాన ఆమె అపవిత్రురాలని ముద్ర వేయడం ఏం న్యాయం? ఏం ధర్మం?. . . ఇలా ద్వంద్వ సంఘర్షణలతో మదనపడుతూ జరిగింది బయట పెట్టకూడదన్న నిర్ణయానికి వచ్చాను. అంతే, నా గుండెలమీంచి పెద్ద బండ రాయి తీసేసినట్లు హాయి ఫీలయ్యాను. సంఘంచేత వెలివేయబడిన ఒక అమాయకురాలికి మేలు ఏదో చేసానేమోననితృప్తి మిగిలింది.

(ఆంధ్ర పత్రిక కథాకుసుమం)